తిరుగులేని న్యాయం

శ్రీ బలివాడ కాంతారావు

శ్రీకాకుళానికి దక్షిణపు చివరన ఒక పాడుపడిన గృహం యెవరో కొనుక్కున్నారని చుట్టుపట్ల వున్నవారు విని "అ దెవడో మట్టిలో కలిసిపోడానికే కొన్నాడని" వ్యాఖ్యానించారు. కొనిన రెండు నెలల్లో ఆ పాతగోడలమీద నే పెంకుటిల్లు లేచింది. చుట్టూ తీగలతో కంచె వేసి, ఆ జాగాలో రకరకాల పూలమొక్కలు నాటుతూ ఒక ముసలాయన త్రోవ పోయేవాళ్లకు పంచెకట్టు, ఖద్దరుబనియను లేదా అంటే చవకరకం కమీజుతో కనిపించేవాడు. ఇంట్లో యెవరూ ఆడవాళ్లుగానీ నౌకర్లుగానీ అగుపించలేదు. వంట, వండిన గిన్నెలు తనే తోముకునేవాడు. ఎదురుగావున్న నాగావళీ నదినుంచి నీరు ఒక బాల్చీతో మోసుకొనేవాడు. ఇదంతా ఆ వీధిలోనివారు చూసి "దిక్కెవరూ లేనట్లు వుంది. ఏదో చవకగా దొరికిందని యీ యిల్లు కొనుక్కున్నాడని" అనుకున్నారు.

అతను ఆ యింటిలో దిగిన నెలరోజులకు ఆ చుట్టుపట్లవాళ్ళకి అతని విషయం కొంత తెలిసింది. ఆఫీసరుగా పనిచేసి ఈమధ్య నే యితను రిటయిరయ్యాడని, నెలకు అయిదువందలవరకు పింఛను వస్తుందని తెలుసుకున్నాక యీయనగురించి యింకా తెలుసుకుందామని ఉబలాటం ఆ వీధి ప్రజల్లో నేకాదు, ఆ పట్నంలో నే చాలమందికి కలిగింది. మరో నెలరోజుల్లో నే యేవీధిలో చూసినా యీయనమాటలే ఆడుకోవటం మొదలుపెట్టారు. "ఒక్కపూటే వండుకొని భోజనం చేస్తాడట! ఎవరు వెళ్లినా అట్టే మాటాడడు. ఆడంబరంకొద్దిగైనా లేదు. పోనీ పిసినారి అంటే కానే కాదు. వచ్చిన పింఛను అంతా పేదవాళ్ళకే పోస్తున్నాడు. చెయ్యిచాపినవాళ్ళకే కాకుండా చాపనివాళ్ళ కష్టాలూ తెలుసుకొని మరీ సహాయంచేస్తున్నాడు. పాదాలకు చెప్పులైనా లేవు. బాధపడే రోగులవద్దకు పరుగెత్తుతాడు. తన చల్లని మాటలతో వాళ్ళలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని చేకూరుస్తాడు. ఆ పాడుపడిన మట్టి యెంత అదృష్టం చేసుకొని యీ పుణ్యాత్ముణ్ణి తెచ్చుకుందో!..."అని,తలోలా పేదారోదా మొదలు భాగ్యవంతులదాకా యీయనగురించి అనుకున్నారు.

స్వలాభాపేక్ష లేని రమణయ్య ఆ పట్నంలో అందరిచేత గౌరవింపబడటానికి కొన్ని నెలలైనా అవసరం లేకపోయింది. అతనిదగ్గరకు ఆ పూటకు యెలా జరుగుతుందని బాధపడే కటికపేదనుంచి భోగ విలాసాలలో సుఖపడే శ్రీమంతులవరకూ వచ్చి గౌరవిస్తున్నారు. అతని స్వగ్రామం, జీవితంగురించి యెన్నెన్నో ఊహాగానాలు జరుగుతున్నాయి. ఒకనాడు ఒక ముసలాడు మాటల్లో నే నలుగురిమధ్య "తమదేవూరు? మీ తండ్రిగారెవరు? మీ కెవరూ లేరా?" యిలా యేవేవో అడుగుతుంటే నవ్వి "ఈ లోకమే నా వూరు, ఆ భగవంతుడే నా తండ్రి—నాకెవరూ లేకేమి? మీరంతా నావాళ్ళు కారా?" అని సమాధానం చెప్పాడు.

ఒకనాటి సాయంత్రం వాకిట చాప వేసుకొని కూర్చున్నాడు. వయసుమళ్ళిన ఒక వితంతువు భక్తితో తన్మయమై గానంచేస్తోంది. చుట్టూ మూగిన ప్రజ కూడా ఆ పాటలో పరవశులైపోతున్నారు. ఇంతలో వచ్చిన టెలిగ్రాం రమణయ్య విప్పాడు. అది చూస్తూ నే అలా చేతినుంచి జారిపోయింది. కళ్ళనించి నీరు బొటబొటా కారజొచ్చాయి. అటువంటి స్థితిలో ఆయనను యిదివరకు చూడని ప్రజానీకం ఆతృతతో చుట్టుముట్టేశారు. గోడకు చారబడి పెల్లుబుకిపోయిన దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నించలేదు. పంచ చివర కళ్లకు ఒత్తుకుంటూ వెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

"సీతమ్మ...యెవరీమె?" అనే సందేహం అందరిలోనూ పొడసూపకముందే రమణయ్యగారు దుఃఖంలో "అమ్మా—నా బంగారుతల్లీ—నువ్వే మిగిలావను

కున్నాను..." అని యేడుపువిని అందరికళ్లూ తడిసిపోయాయి.

ఓ క్షణంపోయాక కట్టలు తెంచుకొని పొర్లే దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ "నా ఒకే ఒక తల్లి గంపెడు పిల్లలను వదిలిపోయింది. ఆ అమ్మలేని పిల్లలకు అష్టకష్టాలే!"

ఈ వార్త క్షణంలో పట్నం అంతా ప్రాకిపోయింది. ప్రజ తండోపతండాలుగా పరుగెత్తి వచ్చారు. మంచివాళ్ళకే దేముడు కష్టాలు తెచ్చిపెట్టాడని, వాడికే కళ్లుంటే న్యాయం అడివిలోకి పారిపోదని తలోలా రమణయ్య యెదరగా పరోక్షంగాకూడా దేముణ్ణి దూషిస్తున్నారు.

ఆ వేళ రాత్రే కర్నూలుకు బయలుదేరాడు. తనతో యెవరినైనా తోడుగా పంపిస్తామంటే ససేమిరా ఒప్పుకోలేదు. వేగంగా తమరు తిరిగిరావాలని కొందరు ఆముదాలవలస స్టేషనువరకు వచ్చికూడా చెప్పారు.

పదిహేనురోజుల్లోనే తిరిగివచ్చాడు. ఈ దెబ్బ నుంచి తెములుకున్నట్టులేదు. మనిషి చిక్కిపోయాడు. పరధ్యానంగా కూడా వుంటున్నాడు. ఉండీవుడిగీ కూతుర్ని తలచుకొని కళ్లొత్తుకోవటం కొందరు గమనిస్తునేవున్నారు. చాలామంది వస్తున్నారు—పోతున్నారు. ఒక ధనికుడు ఆ దగ్గరగావున్న విశాలమైన తనతోటలో ఆశ్రమంకట్టించి అంతా తనపేర వ్రాస్తాననీ యీ పాడుజాగాను విడిచిపెట్టమని ప్రార్థేయపడ్డాడు. మొదట కాదని వారంరోజులు పోయాక "నాయనా! ఎంచి యెంచి యీ స్థలం నిర్ణయించుకున్నాను. నా కోరికలకి అనువైన జాగా యిదే! నీతోటలో కుష్టురోగులకి ఆశ్రమం చూపించు. వాళ్లసేవచేసి తరిస్తాన"న్నాడు.

ఊళ్లోనూ పొరుగుఊర్లలోవున్న కుష్టురోగులు రానురాను ఆతోటలో చేరారు. వాళ్లతో కలసిమెలసి సేవచేస్తుంటే చాలామంది అది అంటువ్యాధని జాగ్రత్తగావుండమని బ్రతిమాలారు. వీరు చూపిస్తున్న అభిమానాన్ని స్వీకరిస్తూ అన్నాడు. "ఆ జబ్బే నాకు అంకురిస్తే నాకంటే సంతోషి అయిన మనిషి యీలోకంలో యింకెవరూ వుండరు."

ఈ మాటలు విన్నవాళ్లల్లో సంచలనం బయలుదేరింది. కూతురుపోయాక రమణయ్యకు మతికాస్త చలించిందేమోనని కొందరు అనుమానపడసాగారు. ఇప్పుడు తనను ఒంటిగా పడుకోనివ్వరు. ఎవరో కొందరు తనయింటి వరండాలోనే కాపలా వుంటుంటారు.

చవితి చంద్రుడు అప్పుడే క్రుంగిపోతున్నాడు. ఉండి వుండి మనసుకు ఆహ్లాదాన్నిచ్చే గాలివీస్తోంది. గంగమ్మతల్లి గలగలారవముతో వంగుతూ వాలుతూ దిగువకు దిగజారిపోతోంది. ఆకాశాన నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయ్. వాకిట కూర్చున్న నలుగురు మనుషులూ మాటల్లో మాటగా దేవునిమీద దూషణలు వేస్తున్నారు. ఇందులో ఒక వయసుమళ్లిన వ్యక్తి, ఒక నడివయసులోనున్న ధనికుడు, యింకో ఉన్నతవిద్యనభ్యసించుతున్న విద్యార్థి కూడా ఉన్నారు. వీళ్లమాటలు వింటున్న రమణయ్య గది నుంచి బయటకురాగానే అంతా లేచి నులుచున్నారు. వాళ్లని కూర్చోబెట్టి తనుకూడా వాళ్లదగ్గరగా కూర్చొని యేదోనిశ్చయానికివచ్చి తొణకని గొంతుకతో మొదలుపెట్టాడు.

"నేను ఈ పట్నం వచ్చినదగ్గరనుంచీ ప్రజల్లో నాగురించి యెన్నో కట్టుకథలు అల్లుకున్నాయని నాకు తెలుసు. ఏ కట్టుకథలు అల్లుకున్నా అవన్నీ నాకు చెడుగు ఆపాదించినవిగా లేవు. నాలో యేదో మంచి వుందని యీపట్నంప్రజలంతా నన్నింతగా గౌరవిస్తున్నారు. అంతేకాదు, కొందరు "కోవెలకెందుకు వెళ్తారు ఆ బాబుముఖంచూసి మొక్కండి" అని అన్నమాటలుకూడా నాచెవినిపడ్డాయి. ఈ అనంతమైన విశ్వంలో నేనొక నీటిబిందువును. అది కాలమనే యెండకు ఆహుతి అవక యెంతకాలం వుండిపోతుంది? నేను చచ్చిపోయాక మీరంతా మీబిడ్డలకు, వాళ్లు వాళ్లబిడ్డలకు యిలా తరతరాలు నాగురించి "ఇక్కడ ఈ పాడుపడినస్థలంలో ఒక మనిషివుండేవాడు. సాధుపుంగవుడు. కాని గుడ్డిదేముడు వాడిని అష్టకష్టాలు పాలుచేశాడని" దేముడిని దూషిస్తూ నన్ను పొగడుతూ చిత్రిస్తారు. ఈ కొద్దిరోజుల్లోనే దేవుని మీద, నామీదనున్న భక్తితో మీలో చాలమంది దూషణలు కురిపిస్తుంటే నేను వినలేకపోతున్నాను. అంచేత నావిధి యేమంటే ఆదేవదేవుని గొప్పతనాన్ని,

తిరుగులేని న్యాయాన్ని మీకు విన్నవించాలని నిర్ణయానికి వచ్చాను.

నేను నెల్లూరులో ఒక సంపన్న గృహస్థుల యింట్లో పుట్టాను. ఆ సంపదకుతోడు మా కుటుంబం విద్యకు కూడా పేరుపడింది. మా తాత కవులను పోషించడమే కాకండా తను ఆశుకవిత్వం చెప్పేవారు. మా తండ్రి మేజిస్ట్రేట్ గా పనిచేసేవారు. నేను వారి యేకైక పుత్రుణ్ణి. నాకు చిన్నప్పటినుంచీ ముద్దు యెంత చేసేవారో చదువువిషయంలో మా నాన్నగారు అంత శ్రద్ధవహించేవారు. ఆరోజుల్లో పేరుపడ్డ ఉపాధ్యాయులు యింటికివచ్చి చదువుచెప్తుండేవారు. ఉదయం మా నాన్నగారితోపాటు నేను స్నానంచేసి పూజచేసేవాణ్ణి. తరవాత జోడుగుర్రాల బగ్గీయెక్కి బడికివెళ్లేవాణ్ణి. మా నాన్నగారు ఇంగ్లీషు భాషలోనే కాకండా, సంస్కృతాంధ్రాలలోనూ దిట్ట! నేను చిన్నవయసులోనే సంస్కృతం నేర్చుకున్నాను. పదిహేనేళ్ల ప్రాయంవచ్చేసరికి మా నాన్నగారి పరిజ్ఞానం కొంచం కొంచం అర్థంచేసుకొనేవాణ్ణి. పాశ్చాత్య విజ్ఞాన సంపర్కమున్నా యీ దేశంలోనే వేళ్లుపాతుకున్నారు. మా అమ్మ నాపెళ్లి విషయం యెత్తితే, నాన్నచేసిన వాదన నాకెంతో సమంజసమనిపించేది. మన పురాణాల్లో స్వయంవరాల విషయంచెప్తూ బాల్యవివాహాలు సంఘం శుష్కించి పతనమైపోయే సమయంలో వచ్చాయని చెప్పారు. నేను పెళ్లిచేసుకోకండానే ఉన్నతవిద్యకు మద్రాసు వెళ్లటం జరిగింది.

నావిద్య పూర్తయింది. నేను మొదటితరగతిలో ఉత్తీర్ణుడనయ్యాను. ఇంగ్లాండు బారెట్లా చదువుకోసం పంపిస్తామని మా నాన్న అనుకుంటుంటే అనుకోకండా ఉద్యోగం నా కాళ్ళదగ్గరకు వచ్చింది. మా అమ్మ నన్ను పైదేశాలు ససేమిరా పంపించడానికి వప్పుకోపోవటంవల్ల ఆఫీసరు ఉద్యోగం దొరకటంవల్ల నేను యిక స్వతంత్ర జీవితంలో పడ్డాను. అప్పటివరకు ఒక మచ్చ, మాయ, యెరుగని జీవితం. చదువు తప్పించి యింకో ధ్యాసవుండేదికాదు. చెడుగురించి తలచటమే భయం. అలాంటివాళ్లను అసహ్యించుకొని దూరదూరంగా వుండేవాణ్ణి. అమ్మ నాన్నను విడిచిపెట్టి రావటంకాదు. కాబట్టి ఒంటిగా వుండవలసి వచ్చేది. ఏ పట్నం బదిలీ అయినా ఊరుబయట పెద్ద బంగాళా ఒకటి వుండేది. ఉద్యోగంలో నా ప్రతిభ చూపిస్తామనే ధ్యాసతప్పించి పెద్ద పెద్ద ఆశలు కోరికలూ యేమీ వుండేవికావు. నా మంచితనాన్ని గౌరవించేవారు.

అప్పుడప్పుడు నా పెళ్లివిషయం ప్రస్తావన వచ్చేది. సంబంధం విషయంలో మా అమ్మా, నాన్నకూ అభిప్రాయాలు యెప్పుడూ యేకీభవించేవికావు. నాకూ్కడా పెళ్లి అంత వేగిరంగా చేసుకోవాలని మనసుండేదికాదు.

ఇలాంటి పరిస్థితులలో యీవూరే బదిలీమీద వచ్చాను. పట్నం శివారులలో నా బంగాళా! మామూలుగానే కోరినట్లు. ఒక వయసుమళ్లిన స్త్రీని వంటపుట్టిగా బంట్రోతు కుదిర్చిపెట్టాడు. ఆమె యిదివరకువచ్చిన ఆఫీసర్లకు కొందరికి వంటపుట్టిగా వుండేది. పెద్దతోటవుండేది. నౌకర్లకోసం ఆతోటలో ఒక మూల రెండు చిన్నగదులు వుండేవి. వంటమనిషి, తల్లి స్వంతబిడ్డని చూసినట్లుగా చూసేది. ఆమె యిల్లు బంగళాకు రెండు ఫర్లాంగులదూరంలో వున్న పట్నంలో చివరివీధిలో తాటాకుల గుడిసె. ఆ గుడిసెల్లో వున్నవాళ్ళు చాలా దరిద్రమైన జీవితంగడిపేవారు. వాళ్లంతా ఒకే కులస్థులు—కులపెద్ద—ఆ పెద్ద వేసే ఆంక్షలు—శిక్షవేసే అధికారం ఒక్కడి చేతిలోనే—వాడు అన్యాయానికిపోతే వాళ్ళకింకొకదారిలేదు.

మండు వేసవి. ఒకనాటి మధ్యాహ్నం ఆవీధిలో ఒక కొంపకు నిప్పంటుకొని వీధంతా వూడ్చేసింది. వాళ్ళకు ప్రభుత్వం యేదో సహాయం చెయ్యాటం కోసం నేను పలుకుబడి వినియోగించాను. ఈలోగా వంటమనిషి వుండటానికి నా బంగళాలో ఖాళీగావున్న నౌకర్ల గదులు వుపయోగించుకోమని చెప్పాను. ఈ యిల్లు కాలిపోగానే ఆమె నెత్తీ నోరు కొట్టుకుంది. "ఈ పెద్దలందరికీ తాగడానికి పోస్తేగానీ నాకూతురికి పెళ్ళవదు. దాని పెళ్లికోసం సెమటోడ్చి దాసినదంతా ఆ అగ్గిదేముడు పొట్టన పెట్టుకున్నాడు. ఇంక నా యీ తనువుండగా నా కూతురికి సెంబుడినీరు పొయ్యగలనా?" అని ఆమె యేడ్చింది. నేనేదో సహాయంచేస్తానని ఓదార్చాను. నామాటలు ఆమెకేమీ సంతోషం యివ్వలేదు. ఎంచేతంటే కష్టించి గడించినదానితో చేసినపెళ్ళికి,

ఒకరు వూరికే యిచ్చినదానితో చేసినపెళ్ళికి యెంతో తేడావుందని ఆమెనమ్మకం. ఆ యిల్లు కాలిపోవటం కాదుగాని ఆమె బెంగతో అదో పరధ్యానంగా వుండేది,

ఒకనాడు నిద్రనుంచిలేచి అలామంచంమీద నుంచే కిటికీగుండా చూశాను. తూరుపున ఉషః కాంతులు అలుముకుంటున్నాయ్. రానురాను తేట పడుచున్న కాంతిలో నూతిదగ్గర స్నానంచేస్తున్న వంటమనిషి కూతుర్ని చూశాను. నా దృష్టియెంత మరలించుదామని ప్రయత్నిస్తున్నా లాభంలేక నాకోరికకు దాసుడయ్యాను. ఆమె నాకగపడేది కాదు—నా వేపు చూడనూ లేదు. కిటికీనుంచి దొంగ తనంగా తొంగిచూసి తొలిసారి నా యౌవ్వనంలో వర్ణించలేని వ్యగ్రానుభూతిని పొందాను. ఆ వేళ కేంపుకు వెళ్లవలసింది. వెళ్ళక యింటిలో నేవుండి దృష్టి ఆయింటి వేపే సారించేవాడిని. ఆరోజంతా ఆమె కనపడలేదు. ఇక కనపడుతుందన్న ఆశకూడా లేదు. ఆ మరుసటిరోజు ఉదయం వేగంగా మేల్కొని యెదురుచూశాను, కానీ ఆమె ఆ వేళ రా నేరాలేదు.

ఆ వారంరోజుల్లో ఒకరోజున కేంపునుంచి తిరిగి వచ్చేసరికి భోజనాలగదిలో అన్నీ అమర్చివున్నయ్. మామూలుగా వంటమామ్మ భోజనందగ్గర లేక పోవటంతో గ్రహించి నాలోవున్న ఉబలాటంతో క్రీగంటితో వంటయింటివేపు చూస్తూ "మీఅమ్మ ఒంట్లో బాగులేదా ?"

జవాబు వెంటనేరాలేదు. గ్లాసులో మంచినీరు గడగడా త్రాగివేసి "మంచినీరు"న్నాను. ఆమె విధి లేక వస్తుంటే కళ్లిప్పచెప్పి చూశాను. ఆమె తిరిగి వెళ్లిపోతుంటే చప్పునలేచి వెంబడిద్దామని ఉబలాట పడ్డానుకాని ఆమె యింతలో మెల్లగావణుక్కుంటూ వచ్చి దగ్గరగా కూర్చుంది.

"జ్వరంతో యెందుకొచ్చావమ్మా" అన్నాను.

"అదేపోతుంది బాబూ......"

ఆ రాత్రి చాల సేపటివరకు నాకు నిద్రపట్టలేదు. మధ్యాను ఈమె రాక పోతే అథవా మెల్లగా మాటలు కలిపే వరకైనా వచ్చే వాడిననుకున్నాను.

వాళ్లి వీధిలో మళ్ళీ యిల్లు తయారవుతోంది. నాలుగు రోజుల్లో వెళ్లిపోతారనగా నేను అనుకో కుండా కేంపు నుంచి ఒక రోజు ముందుగానే వచ్చేశాను. నేను వచ్చే సరికి వంటమామ్మ జ్వరంతో మూలుగుతోందని గబగబ వెళ్లాను. నన్ను చూడగానే లేని బలం తెచ్చుకొని కూతుర్ని వెళ్లి వంటచెయ్యమని గట్టిగా ఆజ్ఞాపించింది. కూతురు వెళ్లటానికి సంశ యిస్తుంటే "బాబు దేముడి లాంటోడు - అలాంటి బాబును ఆకలితో వుస్తావా? నివ్వువెళ్లక పోతే నేనే వెళ్తాను" అని. లేవబోతుంటే విధిలేక వంట చెయ్యా టానికి బయులుదేరింది. నేను చాలా సేపు మామ్మదగ్గర కూర్చున్నా మనసు అక్కడనే వుంది. "వేడి నీరు కాగివుంటుంది స్నానం చేసీ బాబూ! అలసి పోయి వచ్చావు—అమ్మిదగ్గర సంశయం పడకండి. మీలాంటి మారాజులదగ్గర బతికింది మీ బిడ్డ అవుతాదిగానీ..."

వచ్చాను. బంగాళా వేపు అడుగులు వేస్తుంటే నాలో యౌవనం వుబ్బి తబ్బిబ్బయిపోతోంది. నాలోని మంచీచెడ్డా విచక్షణజ్ఞానాన్ని పశుబలంతో కూడిన కోరిక చంపివేసింది. స్నానాల గదిలో నీరు దించి ఆమె వస్తుండగా యెదురుపడ్డాను. వసారాలో దీపం లేదు. ఆమె ప్రక్కకు తప్పుకొని రాబోతోంది. మెల్లగా పిలిచాను. ఆమె ఆగింది. ఎదురుగా నిల్చొని నోటి నిండుగా యేదో అందా మనుకున్నానుగాని అనలేక పోయాను. నా శరీరం అంతా నా అధీనంలో లేకుండా పోయింది.

* * *

ఆ దెబ్బ తిన్న లేడిని, మెల్లగా వెక్కి వెక్కి యేడుస్తున్న అబలను...విడిచిపెట్టి స్నానానికి వెళ్లాను. నేను తిరిగి వచ్చే సరికి ఆమె వంట యింటిలో ఒక మూలకూర్చొని యింకా కళ్లల్లోనుంచి మౌనంగా నీరు కారుస్తునే వుంది. నాలాంటి అందమైన యువకుని తొలివలపును పొందే అదృష్టం యీ దిగువ అంతస్తులో నున్న ఆమె పొందినందుకు సంతోష పడకుండా యెందుకేడవా లనిపించింది—ఆక్షణంతో ఆస్త్రీ సర్వస్వాన్ని నేను అపహరించానని అందువలన ఆమె నైతికంగా శక్తి విహీనఅయ్యిందనీ ఆమెను పూర్తిగా భరించే బాధ్యత నాకుందని ఆలోచించ లేకపోయాను. ఒక పువ్వు పూసింది. ఒక తుమ్మెద వ్రాలి మధువును గ్రోలి వెళ్ళిపోతుందనే వుద్దేశంతో నే వున్నాను.

రెండునెలలు గడిచిపోయాయి. నాకేదో సంబంధం చూశారంటే నెల్లూరు వెళ్ళవలసి వచ్చింది. అమ్మకు లక్షణాలు-నాన్నకు పిల్ల అభ్యసించిన సరి

రైన విద్య, ఆవిద్య యిచ్చిన వినయ సంస్కారాలు నాకు ఆమె వర్ణించవీలు పడని అందం నచ్చటంవల్ల సంబంధం స్థిరమై పోయింది. ఆ వాలు కళ్ళు, పసిమి ఛాయతో మెరుస్తున్న మృదువైన శరీరము, కదులుతుంటే జారుతున్నట్లుండే ఆనడక ముత్యాలు రాల్చే ఆ దరహాసం—ఆక్షణం నుంచీ నా కింకో ధ్యాసలేదు!

నేను తిరిగి వచ్చాక మారిన మనిషి నవటంలో వంటమనిషి "ఏవయసుకు తగ్గసొంపు ఆవయసులో లేకపోతే బతుకు పెడదారులుపట్టాయంటారు ఇంటికి వెళ్ళావు-నే చెప్పింది అమ్మకీ అయ్యకీ చెప్తావా బాబూ" అని అడిగింది. సంబంధం స్థిరమైనదని చెప్పడానికి నా నోరు పెగల్లేదు. ఆ నెలరోజుల్లో నేఆమెకు, వాళ్ళ వీధిలో వాళ్లకీ యేవో వాదోపవాదాలు జరుగుచున్నాయని విన్నాను. అసలు విషయం బయటపడితే ఆకారకుడైన వాడి ప్రాణాలు నిలువునా తీస్తారనికూడ విన్నాను. నాకింకో గత్యంతరం లేకపోయింది. నాకు మదరాసులో వుండే పలుకుబడిని వినియోగించి ఢెల్లి గ్రాములమీద బదిలీ తెప్పించుకున్నాను.

ఇంకా ఒకగంటలో యిల్లు కదుల్తాననగా వంటమనిషి వీధిలోని పదిమంది నా బంగళా చుట్టుముట్టారు. నాకు హెచ్చుభయంవల్ల వచ్చేధైర్యంతో "ఒకడిని కొట్టడానికి యింతమంది రావాలా? ఒక ఆఫీసరు మీద లేనిపోని అనుమానాలుతో మీరు యిలా పరుగెత్తుకొచ్చారు. నాకుతగ్గబలం నాకూవుంది. ఇక్కడినుంచి కేకవేశానంటే పోలీసులు తయారు. మీ అందరి చేతులకూ బేడీలు పడ్తాయి-జాగ్రత్త," అని హెచ్చరించినా అంగులో పెద్దమీసాలు తిముడుకుంటూ ఒకడు ముందుకొచ్చి "నివ్వు పెద్దోడివైతే పెద్దోడిలాగవుండు. ఆఫీచరువైతే నీతిగావుండు. అన్యాయం సేసావు-నీకు సిక్షయేస్తాం!"

వాళ్ళు చేతులు సర్దుకుంటున్నారు. వంటమనిషి చప్పున ముందుకొచ్చి గట్టిగా "ఈ బాబునేముడి లాంటోడు. యీ బాబుసేశాడంటే నేను నమ్మను. ఇలాంటి మంచిబాబు మీద మీరు సెయ్యేస్తే నీకు దేముడు బాగా సూడడు-వెళిపోండి-నామాట వినండి" అనగానే అందులో ఒక మొరటుమనిషి.

"నీ కూతురు గడ్డికొరికింది గానీ నివ్వు కాదే... అదే కాదని సెప్పనీ...సల్లగ యెళిపోతాం!"

అంతలోనే వంటమనిషి కూతురును పిలి పంచడానికి ఒకడు వెళ్లాడు. ఈలోగా "అదివీడే అంటే ముక్కచెక్కలుగా కోసి యిక్కడే పాతిపెడ్దాం. పారిపోదామని చూశాడు..."—యిలా వ్యాఖ్యానిస్తున్న వాళ్లమాటలువిని నా ప్రాణాలు సగంపోయాయ్.

మామ్మకూతురు వచ్చింది. ఒకసారి మెల్లగా తలెత్తి నా వేపుచూసింది. బహుశః నాముఖాన్న రక్తంలేకపోవటం గమనించిందేమో ఓక్షణంపోయాక :

"ఈ బాబుకేమీ తెలీదు"

ఈ జవాబువిని, ఆమెను నానాదుర్భాషలాడుకుంటూ వచ్చిన వాళ్లు వెళ్లియారు.

ఇక స్వంత పట్నంలోపని. ఐశ్వర్యంతో పాటు అధికారం—ఊఁ అంటే సేవకులు ఆఁ అంటే సేవకులు. ఆచుట్టుపట్ల కని వినియెరగనంత బ్రహ్మాండంగా నా పెళ్లిజరిగింది. ఈ పెళ్లితో రెండు పెద్ద సంపన్న గృహాలు ఒకటయ్యాయి. నా భార్య యింట్లో అడుగు పెట్టినతోడనే ఉద్యోగరీత్యా ఒక మెట్టు పైకి లేచాను. ఇంట్లో క్రొత్తకోడలు కొద్దిరోజుల్లోనే పాతబడి యింటి మహాలక్ష్మి అయిపోయింది. అన్ని శుభలక్షణాలు కలిగి తనమంచితో అందరిచేతా జేజేలు అందుకోవటం మొదలుపెట్టింది. నేను పూర్తిగా ఆమెలో యేకమైపోయాను. ఆమెను విడిచిపెట్టి ఒక రోజు వుండటం కష్టమనిపించేది. ఈలోకంలో ఆమెకంటే ప్రియాతి ప్రియమైన దింకొకటిలేదు. జీవితం ఆనందం వెన్నెలలా గడిచిపోతోంది. ప్రజలచే ధర్మప్రభువని నేను, మహాలక్ష్మి అని మా ఆవిడ కొనియాడ బడుతున్నాం!

నాభార్య కాపరానికి వచ్చిన మూడోయేట బాబుపుట్టాడు. మా సంతోషానికి మేరలేదు. ఆబాబు అందచందాలు యెన్నోసార్లు నేనే తలచుకొనేవాడిని. సరిగ్గా నెలరోజులనాటికి పోయాడు. ఆదుఃఖంనుంచి నాభార్య మళ్లీ కడుపుపండేవరకూ తెములుకోలేదు. బాబుపుట్టిన నక్షత్రం మంచిదికాదని బాబే బ్రతికుంటే దంపతులలో యెవరికైనా గండం వుండేదని సిద్ధాంతులు చెప్పటంవల్ల నేను బాబుపోయినందుకు విచారించలేదు. బాబుపోయిన యేడాదికే నా సీతమ్మతల్లి పుట్టింది. నాతల్లిది నారూపే. అందరూ చాలా అదృష్టవంతురాలౌతుందనేవారు. నా సీతమ్మను యెంతో గారా

బంగా పెంచాం. ఇందరు సేవకులున్నా రోజూ యెలాగో తీరుబడిచేసుకొని పిల్లను ఆడించేవాడిని; ఎదిగినకొద్దీ అది నాన్నపిల్ల అయ్యిందిగానీ అమ్మపిల్ల కాలేదు. నాన్నను విడిచిపెట్టి వుండలేకపోయేది.

సీతమ్మ పుట్టిన తరవాత నా భార్య ఆరోగ్యం కొంతవరకు దెబ్బతిన్నది. పెద్ద వైద్యులను పెట్టాను. తేరుకుంది. కానీ మరి సంతానం లేదు. సీతమ్మకు యెనిమిదేళ్ళ ప్రాయం వచ్చేసరికి నా భార్యకు పెద్ద జబ్బుచేసింది. శెలవుపెట్టి మరీ ఆమెకు సేవచేశాను. నాకు ఒకక్షణం విశ్రాంతి వుండేదికాదు. ఏమాతుందనో ఆతృత. ఏ కొద్ది తీరుబడిలోనూ ఆ ప్రతిబింబం నాతలలో తిరిగి ఆలోచనలను హద్దూ ఆపూ లేకండా తీసుకపోయేది—

ఆ రాత్రి... సరిగ్గా పండ్రెండు కొట్టింది. ఐనా నిద్దర రాలేదు. నా భార్య మంచంమీద తలదగ్గర ప్రక్కనే కూర్చున్నాను. ఆమె యేవో తెలివిలేని మాటలు ఆడుతోంది. నా చేతిని తీసుకొని ఆమె నుదిటి మీద పెట్టుకుంది. డాక్టరు ప్రక్కగదిలో పడుకున్నాడు. చీకటి రాత్రి. బంగాళా చుట్టూ హోరు మంటూ ఘీంకారం వినిపిస్తోంది. ఒకోసారి యేదో భయంకరమైన అరుపు, మనసు ప్రళయం వచ్చి పడినట్లుగా భయంతో బితుకు బితుకు మంటోంది. గుండె జోరుగా కొట్టుకుంటోంది. అయినా నేను ఆక్షణంలో యీ లోకంలో నాకు ప్రియాతి ప్రియమైనది చెయ్యి జారిపోతుందని అనుకోలేదు.

ఒక గంట పోయాక తుఫాను తరవాత అలముకున్న ప్రశాంతతలా నిర్మలమైన నిశ్శబ్దం—నా భార్య కళ్లు తెరచింది—ఆమె కళ్లల్లోకి చూశాను. ఆ పెదవులపై చిన్న నవ్వు... మెల్లగా ఆ పెదవులు కదల నారంభించాయ్... "లోకంలో అవసరం లేకండా... ఏపనీ జరగదు! ఇప్పట్లో—నాకళ్లు మూయటానికీ—అవసరం కలిగిందేమో! మీరు లోకంకోసం బ్రతికే అవసరంకూడా వుందని... మరచిపోకండి!"

ఆమె ముఖం చూస్తుండగానే నా కళ్ళల్లో నీరు నిండుకున్నాయ్. ఆమె కళ్ళు క్రుంగిపోతూ క్రుంగిపోతూ మిగిలిన నీటిని బయటకు రాల్చాయ్. ఆ పెదవులు, ఆ చిరునగవుతోనే యెండిపోయాయ్."

ఇంతవరకూ రమణయ్య చెప్పాక ఆ దృశ్యం యిప్పుడు కళ్లకు కట్టడంవలన కామోసు దుఃఖం ముంచుకొచ్చి మాటాడలేకపోయాడు. కళ్లల్లో నీరు గిర్రున తిరిగిపోయాయి. కాస్సేపు పోయాక గద్గదస్వరంతో "నేను చాలా బలహీనుణ్ణి. నాభార్య ఆ రూపుతో నా దగ్గరనుంచి మాయమైపోగానే జీవితంమీద విరక్తి కలిగి అన్నహారాలమీద, వుద్యోగంమీద ఆసక్తి పోయింది. ఈ జీవితం అంతా మాయ అని యేదీ శాశ్వతంకాదని గ్రహించాను. ఏ అడవుల్లోకో, హిమాలయాలకో పోయి తపస్సు చేసుకుందామని అనుకున్నాను. రోజంతా యెడతెగని ఆ వేదన, దుఃఖంతో క్రుంగిపోయాను. నడుస్తున్న బస్సుమీదనుంచి గెంతాలని, పరుగెత్తుతున్న రైలు క్రింద తల దూర్చాలనిపించేది. నా కాళ్ళక్రింద వుండే నేల బీటలుదేరి నేను కూలిపోయినట్లు; నేనో వెన్నముద్దలా అయి మీద కత్తిపడటానికి సిద్ధంగా వున్నట్లు—బాగుచేసిన దూదిలా యెగిరిపోతున్నట్లు-ఇలా యెన్నో విధాలుగా అయిపోయాను.

శీతాకాలం యింకా సరిగ్గా చొచ్చుకోలేదు. సాయంత్రం గాలివిసురులతో పెద్ద వర్షం కురుస్తోంది. బంగాళాకిటికీగుండా వీధిలోకి చూశాను. రోడ్డుమీద గేదెలు, దున్నపోతులు వర్షంలో తడుస్తున్నయ్. ఆ కదలని గేదెలు, పోతులవేపుచూసి బయటకు వచ్చాను. చలివేస్తోంది. నేను వర్షంలోనికి చొచ్చుకొని ఆ గేదెల దగ్గరగా వెళ్లి కూర్చోవటం అనుకోకుండానే జరిగింది.

ఇన్నాళ్ళూ పేరుకున్న దుఃఖాన్ని పెల్లుబికి గట్టిగా యేడవటానికి వుపక్రమించాను. ఆ కొద్ది సేపట్లో ఒక పోతు అరచింది. నేనొక నరకంలో వున్నట్లు యీ యమధర్మరాజు నన్ను ప్రశ్నిస్తున్నట్లనిపించింది. ఆ అరుపు విన్నవెంటనే నాలో "ఇలా యేడుస్తున్నావు నువ్వు నీ భార్యతో నిజాన్ని కప్పకండా మెసలావా?"

ఈ ప్రశ్న నన్నెంతో కలవరపెట్టసాగింది. ఈ కలవరం నా యేడుపును తగ్గించి "నివ్వే అలా మెసిలివుంటే వంటమనిషి కూతురితో నీ సంబంధం చెప్పకండా యెలా వుంచేవాడివి? నవ్వు నీ భార్యను మనసారా ప్రేమించానంటే యెలా నమ్మమంటావ్?"

"అందులో యేముంది? తక్కువతరగతి మనిషి-నేను కాకపోతే యింకెవరయ్యేవారో?" అన్న నా సమాధానానికి పోతు నవ్వింది.

"యేముందంటావా? తక్కువ తరగతి మనిషా? డబ్బునుచూశా మనిషి విలువకట్తావు? యింతగా యెవరి కోసం విలపిస్తున్నావో ఆ భార్యను పెళ్లాడటానికి తన జీవితం కాల్చుకొని ఆమె నీ ప్రాణాలు దక్కించిందని నీవు కొద్దిగానైనా కృతజ్ఞత చూపించావా? ఇందులో యేముందంటావు? నిద్రలోనుంచి మేలుకో—నిజం వేపు కళ్ళెత్తిమాడు—నీ భార్యకే యీ విషయం తెలిసుంటే యేంచేసేది?"

"ఏంచేసేది...? జీవితం అంతా అనుమానాలతో నిండిపోయేది."

"అర్థం చేసుకోలేని భర్తవై యెందుకిలా కుమిలి పోతావు. ఆమె వంటమనిషి కూతురే మొదలని ఆమెను తీసుకవచ్చి మంచి చెడ్డలు చూసేవరకు నీకు నిద్దర పట్టనిచ్చేదా?"

క్షణంలో నాకు వణుకు పట్టుకుంది. ఇంటికి పరుగెత్తాను. ఆ రాత్రంతా నాకు నిద్దరపట్టలేదు. ఆలోచనమీద ఆలోచనలు సవారీ చేస్తున్నాయి. నాలో యే అన్యాయం లేకపోతే నేనీ కష్టాల్లో చిక్కుకొనిపోవాలి? తెలతెలవారుతున్న కొద్దీ నేను పెనునిద్ర నుంచి మేల్కొన్నట్లయింది. ఏం చేద్దా మన్నా నాలో యేదో పెనుగులాటతో శక్తి లేకుండా వుంది. అడుగు వేస్తే నేను కూలిపోతున్నట్లున్నాను. ప్రకృతంతా నా కళ్లయెదట గిరగిర తిరుగుతూ తల తిరిగిపోతోంది-పగిలిపోతోం దనుకున్నాను.

ఆబాధ భరించలేకపోయాను. నన్ను ప్రతి క్షణం భార్యే ప్రశ్నిస్తున్నట్లనిపించేది. ఆమె చని పోతూ అన్నమాటలో నిజం నాకిప్పుడు స్ఫురించింది. నేను బ్రతికి నా పాపానికి బాధపడే అవసరం వుండ బట్టే ఆమె చిరంజీవి కాలేదు.

బయలుదేరాను. ఈ వేషంతో మళ్ళీ ఆమె యెదుటపడటం నాకిష్టం లేదు. ఆమె యెవరితోనో లేచిపోయి వుంటుంది. పిల్లలతోనూ పాపలతోనూ వున్నా దరిద్రంతో బాధపడుతూ వుంటుంది. ఆమె రక్షణకోసం యిదివరకే డబ్బు ముట్టచెప్పి వుంటే ఆర్థికంగా పునాది వేసేవాడిని. యిప్పుడు ఆమెకు నే నెవరికీ తెలియకుండా సహాయం చెయ్యాలి.

సాధువేషం వేసుకున్నాను. 'భిక్షాందేహి' అని ఆ పాకదగ్గరకు రాత్రి యెనిమిది దాటాక వెళ్లాను. పాకలోపల చిన్న బుడ్డీదీపం వెలుగుతోంది. పిల్లలు మందకున్నారు. లోనుంచే ఒక స్త్రీ "మేమే పస్తు లున్నాంబాబూ...యెళ్లండి" అన్నది. ఆ గొంతుక లానే వుంది. కానీ మనిషిని చూడాలి. మీ యింటి వెనక సరిగ్గా యీ రోజు సరుకు చెట్టు మొదట త్రవ్వితే లక్ష్మి ప్రసన్నమౌతుందని జోస్యం చెబుదామను కున్నాను. ఆమె బయటకు రాలేదు. పోనీ కాసిన్ని మంచినీరు పోయమ్మా అని అడిగాను. ఆమె బయటకు రాగా నే వెన్నెల్లో చూశాను. ఆమె పోలికలేమీ లేవు. వెంటనే "పదియేళ్ళ క్రితం కాశీ పోతూ యిలా వచ్చాం తల్లీ! ఈ యింటిలో ఒక తల్లీ కూతురూ వుండేవారు..."

"అయ్యో పాపం!..." అనగానే నేను అక్కడ కూర్చుండిపోయి "మా మంచి తల్లమ్మా... ఏమైంది?"

ఆయిల్లాలు గడపలో కూర్చొని చెప్పడానికి ఉపక్రమించింది. "ఆకూతురు యెక్కడో గడ్డితిన్నా దని ఆతల్లి యాతనపడిపోయి మంచంపట్టింది. జాతోళ్లు వెలివేశారు. మనమరాల్ని చూడకుండానే సచ్చి పోయింది. మనుమరాలంటే మనుమరాలు కాదు. మారాజులయింట్లో పుట్టవలసిందిగానీ ఇలాంటి పాకల్లో మెసలాలిసిందికాదు. విధి వీధంతా యీపిల్లని నూసాక ఆపాపం పాపిష్టి పెద్దింటోడే సేసాడని అనుకున్నారు. ఆడు దీని బతుకునాశనంసేసి దూరదేశాలు యెలిపోయి పెళ్లిసేసికోని పిల్లా జల్లాతోని హాయిగా బతుకుతున్నా డట! ఆసక్కని పిల్ల ఆడి రక్తానికి పుట్టిందికదా ఆడి కూతురౌతాదా, దాని కూతురౌతాదా? అయ్యో! సేసినాపాపం సేసినాను—దాన్ని సేరదీయకపోయినా నాకూతురని అభిమాన మేనా ఆడికిలేకపోనాది? ఆడు మనిషేనా? అడవిలో సింహంలాంటిదానికి పిల్లలని అభిమానం వుంటాది? దాన్ని యేలుకోమని అనలేదు. పిల్లబతికి ఒకింటి దవడానికేనా ఆదరువు చూపించాడు కాదు. ఇల్లు అమ్మేసింది—ఆపిల్లకి పాలుసాలకే—చెట్టుమీద పక్షిలాగ ఆ కూనని నీగడప నాగడపా తిప్పి తిప్పి యేడాదిపిల్లను సేసింది. తిండికిలేదు. ఒళ్ళు కప్పుకోడానికైనా బట్టలేదు. ఎందుకు మారాజు మాయల్లో పడిపోనాది? కూడుగుడ్డాలేక కుమిలిపోనాది. నలుగుర్లోను అపకీర్తి తెచ్చుకుంది—ఎవరూ కనిక రించలేదు. ఆ పుట్టించిన దేముడు కూడా కనికరించ

లేదు. పిల్ల బతకాలని మానం అమ్ముకున్నాది. వ్యాపారంలోకి దిగిపోయింది. అందులోకి దిగాక మనిషెంత కాలం దిట్టంగా వుంటాది? అందరూ దాని తల్లి మంచికీ దీనిచెడ్డకీ పోల్చి తిట్టారు. ఏ గడపా యెక్కనిచ్చారు కాదు. జబ్బులతో వికారంగా తయారయి పోయి—రెండేళ్ళక్రిందటే సచ్చిపోయింది.”

నేను ఆమె మాటలువిని అలా కూలబడిపోయాను. ఆమె మౌనం దాల్చిందని కొంతసేపటికి తెలుసుకొని “ఆకూతురేమైంది — ఎక్కడుంది చెప్పమ్మా” అని అడిగాను.

ఆమె నా ఆతృత గమనించి “అంత చక్కని పిల్ల—ఎవరైనా దగ్గరుంచుకో గలరు. కానీ ఆ తల్లి సంగతి తెలిసిన వాళ్లు యీ వూర్లో ఆ పిల్లను యెవరు సేరదీస్తారు? ఏదో పెద్దపట్నమట—పెద్దయితే ఆ పడుపు వృత్తిలో పెట్టుకుందామని ఒక షోకు కత్తె తీసుకుపోయింది! సూడు బాబూ? దానిగతి — ఆ పెద్దోడి కూతురు పడుపువృత్తిలో వయసు వచ్చాక దిగేటప్పుడు - వాడి భాగ్యభోగాలు వుండి యెందుకు? ఏదోజాతోణ్ణి కట్టుకుంటే అది నలుగురూ యేలెత్తి చూపించినట్లు హీనంగా సచ్చిపోనా?...”

అక్కడనుంచి బయలు దేరుతూ త్రోవలోనే మూర్ఛ పడిపోయినట్లయిపోయాను. క్షణికోద్రేకాలు మనిషిని న్యాయాన్యాయ విచక్షణ లేకుండా చేసేస్తాయి. నా చదువు నాకు బలమైన వ్యక్తిత్వాన్ని యివ్వలేదు. అంచేత నాలో ఆ రోజుల్లో దృఢమైన మనస్సు, స్వంతం మరచిపోయి అందరినీ ప్రేమించే స్థోమత లేకపోయింది. ఇంత జరిగాక నేను యిక జీవితం మీద ఆశపెట్టుకోవడమెందుకని ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించాను. ఎన్ని సార్లు ప్రయత్నించినా నా భార్య చనిపోతూ అన్నమాటలే జ్ఞప్తికి వస్తున్నయ్. నేను బ్రతికే అవసరం యెందుకు కలిగిందీ కొన్నాళ్లు పోయాకగానీ నాకు అర్థంకాలేదు.

నా కూతురుకోసం వెతకడానికి ప్రారంభించాను. నాకు ఆమె జాడ తెలియలేదు. నా జీవితం నా కష్టం మీద వచ్చే ఫలంతోనూ మానవసేవకు అంకితం చేస్తేగానీ నాకు ముందుగతిలేదు. ఆ మధ్య తీర్థయాత్రలు సేవిస్తూ కలకత్తా, బొంబాయి నగరాల్లోని పడుపువృత్తి పెట్టుకొనే వారుండే వీధుల్లోనికి వెళ్లాను. అక్కడైనా నాకూతురు అగుపడుతుందేమోనన్న భ్రాంతితో! వాళ్ల హీనపరిస్థితులు చూశాను, వాళ్ల చిరునవ్వు వెనక అగాథంలావున్న బాధను చూడగలిగాను. వాళ్లందరిలోనూ నాకూతుర్ని చూశాను. అంతా నాబిడ్డలే! నాలో యీ పరివర్తన యెప్పుడు వచ్చిందో అప్పుడే అనుకున్నాను. నేను అసలైన విద్య లోకంలో మెసలి అనుభవించి అభ్యసించ గలుగుతున్నానని!

మీరంతా అడగొచ్చు — ఈ పాడుకొంపలో యెందుకున్నారని? కుష్టురోగం రావాలని యెందుకు కోరుకుంటున్నారని! నేను యెప్పుడైతే నాతప్పును తెలుసుకున్నానో అప్పటినుంచీ నాకు వీలైనంత హెచ్చుగా హీనంగా బాధపడాలనేవుంది. నేను చేసిన పాపానికి ఫలితం అనుభవించకుండా వుండటానికి ప్రయత్నిస్తే యీ పాపాన్ని నేను మళ్లీ జన్మకు తీసుకపోయి అప్పుడు అనుభవించవలసివస్తుంది. మనకున్న అధికారాలని స్వలాభంకోసం దుర్వినియోగం చేసేవచ్చు. మనకున్న బలం దీనులమీద చూపించవచ్చు. చాటుగా మన ఆశలు, అబద్ధాలు అన్యాయాలతో ఫలింపచేసుకోవచ్చు! ఇవన్నీ యెవరూవినరు, చూడరనుకోవటం పొరపాటు! దేవుడు లోకంయొక్క కళ్లూ చెవులూనూ! మనుషుల అంతర్గతంలో యేంజరుగుతుందో కూడా ఆ కళ్లు చూస్తాయి, ఆ చెవులువింటాయ్!